సాక్షి
శ్రీకాకుళం

ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



టీడీపీ నాయకుడి కబ్జా

హిరమండలంలో టీడీపీ నేత రెచ్చిపోయాడు. ప్రభుత్వ స్థలాన్ని కాజేందుకు ప్లాన్ వేశాడు.

- 8లో



ఘనంగా క్రిస్మస్ వేడుక

జిల్లా కేంద్రంలోని ఓ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మంత్రి ధర్మాన పాల్గొన్నారు.

- 8లో



వైభవంగా గంగా హారతి

శ్రీకాకుళం కల్చరల్: నక్కవీధిలోని ఉమాజఠలేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాసం సందర్భంగా శనివారం గంగా హారతి నిర్వహించారు. ఆలయ అర్చకులు అశ్వనికుమార్, మహేష్ ఆధ్వర్యంలో ఆలయంలో ఉన్న నీటికొలను వద్ద హారతి ఇచ్చారు.

న్యూస్‌రీల్

13న పాతపట్నంలో సామాజిక సాధికార బస్సుయాత్ర



రెడ్డి శాంతి, ఎమ్మెల్యే

ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గంలో ఈ నెల 13వ తేదీన సామాజిక సాధికార బస్సు యాత్రను నిర్వహిస్తున్నట్లు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి తెలిపారు. ఈనెల 10వ తేదీ ఆదివారం జరగాల్సిన బస్సుయాత్ర తుఫాన్ కారణంగా వాయిదా పడిందన్నారు. ఈ నెల 13వ తేదీన జరగనున్న బస్సు యాత్ర విజయవంతం చేయాలని కోరారు.

12న ఆమదాలవలసలో సీజీఆర్ఎఫ్ వేదిక

అరసవల్లి: తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 12న ఆమదాలవలస సబ్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక(సీజీఆర్ఎఫ్) ఉదయం 10గంటల నుంచి జరుగుతుందని ఆపరేషన్స్ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీజీఆర్ఎఫ్ చైర్మన్ రిటైర్డ్ జడ్జి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమంలో ఆమదాలవలస సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ వినియోగదారులు తమ గ్రీవెన్స్‌ను లిఖిత పూర్వకంగా తెలియజేసి సమస్యలు పరిష్కారం పొందవచ్చని ఆయన తెలిపారు. లబ్ధిదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆదిత్యుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ శ్యాంసుందర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్, తదితరులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యాంసుందర్ కుటుంబ సమేతంగా శనివారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సంప్రదాయ ప్రకారం ఈఓ హరిసూర్యప్రకాష్ న్యాయమూర్తికి పూర్ణకుంభ స్వాగతం పలికి వేద మంత్రోచ్ఛరణల నడుమ అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం ఆలయ విశిష్టతను ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ వివరించగా ఆదిత్యుని జ్ఞాపికను ఈఓ వి.హరిసూర్యప్రకాష్ జస్టిస్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, ప్రొటోకాల్ సిబ్బంది పాల్గొన్నారు. శ్రీకూర్మంలోని కూర్మనాథుడిని కూడా ఆయన దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఎదురేగి స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు.

కోస్టల్ సెలైన్ రైస్ రకాల పరిశీలన



కోస్టల్ సెలైన్ రైస్ రకాలను పరిశీలించిన కొత్తూరు రైతులు

శ్రీకాకుళం రూరల్: జిల్లా కేంద్రంలో గల నైరా వ్యవసాయ కళాశాలలోని ప్రాంతీయ కోస్టల్ రైస్ రీసెర్చ్ స్టేషన్ (ఐసిఎఆర్-ఎన్ఆర్ఆర్ఐ) కోస్టల్ సెలైన్ రైస్ రకాలను (సిఆర్ ధన్ 402, 403, 406, 412) కొత్తూరు మండలానికి చెందిన రైతులు పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు ఈ రకం గురించి రైతులకు వివరించారు. సీఆర్ ధన్ 412, 414 రకాలను 2021-22లో విడుదల చేసినట్లు శాస్త్రవేత్తలు వివరించారు. 140 రోజుల వ్యవధి పంట, మధ్యస్థ సన్నని ధాన్యంతో పాటు తీర ప్రాంత లవణీయతను, నిలిచిపోయిన వరదలను, మధ్యస్తంగా తట్టుకుంటాయని శాస్త్రవేత్తలు విశదీకరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కిరణ్‌గంధ్, గాయత్రీ, శ్యామ్‌లు పాల్గొన్నారు.

● ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో...

అందాల లోకం

ఓ ఆదివారం సంధ్యవేళ అలలు పాదాలను ముద్దాడుతూ ఉంటే అనంత జలనిధిని చూడడం ఎంత ఆనందం. స్నేహితులు, బంధువులతో సహపంక్తిగా కూర్చుని మనసు నిండా భోజనం చేయడం ఎంత సంతృప్తి. పిల్లాపాపలతో కలిసి సెలవు రోజున ఓ కోవెలకు వెళ్లి దేవుడి ఆశీస్సులు తీసుకుంటే ఎంత సంతోషం. వన భోజనాలు కేవలం ఆనవాయితీనే కాదు అవసరం కూడా. గజిబిజి బతుకుల్లో అలసిపోయిన జీవులకు పిక్‌నిక్ ఓ టానిక్‌లా పనిచేస్తుంది కదా. అందుకే రాష్ట్ర సరిహద్దులోని కొన్ని ప్రదేశాలు వన భోజనాలకు స్వాగతిస్తున్నాయి. ఎప్పుడూ వెళ్లే ప్రదేశాలు బోరు కొడితే ఈ స్పాట్లు ప్రయత్నించాల్సిందే.



సున్నాపురం బీచ్‌లో సేద తీరేందుకు ఏర్పాటు చేసిన విశ్రాంతి శాలలు

● సరిహద్దులో ఆకర్షిస్తున్న అందాలు
● బీచ్‌లు, ఆధ్యాత్మిక ప్రదేశాలు
● వన భోజనాలకు అనువైన ప్రాంతాలు

ఇచ్ఛాపురం రూరల్:

శాలిహుండం, శ్రీకూర్మం, అరసవల్లి చాలాసార్లు వెళ్లి ఉంటారు. బారువ, మొగదలపాడు, కళింగపట్నం, అక్కుపల్లి ఎన్నో ఏళ్ల నుంచి చూస్తూనే ఉన్నారు. మహేంద్ర గిరులు, గండాహతి, సీతంపేట కొండలు కూడా కొత్త కాదు. ఇంకా కొత్తవి కావాలంటే సరిహద్దు దాటి అలా కాస్త ముందుకెళ్లాలి. ఇచ్ఛాపురంలో కనిపించే ఒడిశా స్వాగత ద్వారాన్ని దాటుకుంటూ ప్రయాణిస్తే కొన్ని బీచ్‌లు, మరికొన్ని ఆధ్యాత్మిక స్థలాలు ఈ ఏడాది వన భోజనాలకు స్వాగతిస్తున్నాయి.



పర్యాటకుల విశ్రాంతి కోసం ఏర్పాటు చేసిన పార్క్



పర్యాటకులకు ఏర్పాటు చేసిన విడిది

సున్నాపురంలో సాగర సోయగం




సున్నాపురం ఎకో రిట్రీట్

ఒకవైపు విశాలమైన సాగరం తీరం.. మరోవైపు ఏపుగా పెరిగి ఆకాశాన్ని తాకే సరుగుడు చెట్లు, సముద్ర అందాలను తిలకించేందుకు వరిగడ్డితో ఏర్పాటు చేసిన విశ్రాంతి పాకలు, పిల్లాపాపలతో రోజంతా గడిపేందుకు కుటీరాలు, చిన్నారులు ఈత కొట్టేందుకు మంచినీటి సరస్సు. ఒక్క మాటలో చెప్పాలంటే అచ్చం విశాఖపట్నం బీచ్‌ను తలదన్నేలా మౌలిక సదుపాయాలతో అలరించే బీచ్ 'సున్నాపుర్ ఇకో రిట్రీట్'. ఇచ్ఛాపురం మండలం పెద్దలక్ష్మీపురం గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరం, ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో ఉన్న ఈ బీచ్ రెండేళ్ల నుంచి ప్రాచుర్యం పొందింది. గతంలో సాధారణ బీచ్‌గా ఉండే ఈ ప్రాంతం ఇప్పుడు విద్యుత్ వెలుగులతో, రాతి కట్టడాలతో పర్యాటకుల మనస్సును ఇట్టే దోచుకుంటుంది. పర్యాటకులకు ఇబ్బంది కలుగకుండా ఒడిశా ప్రభుత్వం డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. ఈ బీచ్‌కు వెళ్లాలంటే ఇచ్ఛాపురం నుంచి 16 కిలో మీటర్లు తారు రోడ్డు సౌకర్యం ఉంది. బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలపై ఈ ప్రాంతానికి చేరుకోవచ్చు.



కొండలెక్కగలవా..?

సుమారు రెండున్నర కిలోమీటర్ల ఎత్తులో ఉండే కొండపై కొలువైన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు, పర్యాటకులు బారులు తీరుతున్నారు. ఇచ్ఛాపురం మండలం ముచ్చింద్ర గ్రామానికి ఐదు కిలో మీటర్ల దూరంలో, ఇచ్ఛాపురం మండల కేంద్రానికి 12 కిలోమీటర్ల ఒడిశా ప్రాంతంలో ఉన్న ఈ కొండను 'బాలాకుమారి కొండ'గా పిలుస్తారు. కొండపైనే చిన్నపాటి భవనంలో బాలాకుమారి అమ్మవారు కొలువై ఉన్నారు. ఎత్తైన కొండపైకి వెళ్లాలంటే కార్లు, 150 సీసీ ద్విచక్ర వాహనాలపై మాత్రమే వెళ్లగలం. బస్సులు, ఆటోలు, మినీ బస్సులు, టాటా మ్యాజిక్ వాహనాలపై వచ్చే పర్యాటకులు కొండ దిగువన పార్క్ చేసి కొండపైకి నడక దారిన వెళ్లాల్సిందే. కొండపైకి వెళ్లాక అమ్మవారిని దర్శించేందుకు సుమారు వెయ్యి మెట్లు ఎక్కాల్సిందే. పర్యాటకులు గడిపేందుకు కొండపైన పార్క్‌ను ఏర్పాటు చేయగా, పిక్నిక్‌కు అనువుగా విస్తారమైన, ఆహ్లాదకరమైన కొండలు, గుట్టలు ఉండటంతో ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి వందలాది మంది పర్యాటకులు ఈ ప్రాంతానికి వెళ్తుంటారు.



కొండపై పిక్నిక్ స్పాట్

శరవేగంగా మూలపేట పోర్టు పనులు



మూలపేట పోర్టు పనులను పరిశీలిస్తున్న మంత్రి అప్పలరాజు, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, తదితరులు

● సీఎం వైఎస్ జగన్ చొరవ వల్లే పోర్టు నిర్మాణం
● యువకులు, విద్యార్థులు పోర్టు నిర్మాణం చూసేందుకు రావాలి
● మంత్రి సీదిరి అప్పలరాజు

సంతబొమ్మాళి: మూలపేట పోర్టు పనులు వేగంగా జరుగుతున్నాయని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చొరవ వల్లనే పోర్టు నిర్మాణం సాధ్యమైందని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. ఆయన శనివారం పోర్టును సందర్శించి విలేకరులతో మాట్లాడారు. ఏ ప్రభుత్వమూ చేయని రీతిలో సీఎం వైఎస్ జగన్ జిల్లా ప్రజల చిరకాల స్వప్నం సాకారం చేశారని అన్నారు. పోర్టు సౌత్ బ్రేకింగ్ వాటర్ పనులు 1.5 కిలోమీటర్లు, నార్త్ బ్రేకింగ్ వాటర్ పనులు 560 మీటర్లు పనులు జరిగాయని, అలాగే బర్త్, ఇతర పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. ఇదంతా శంకుస్థాపన చేసిన ఆరునెలల్లోనే జరిగిందన్నారు. వలసల మీదే ఆధారపడిన జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నారని తెలిపారు. జనవరిలో పోర్టు డ్రెడ్జింగ్ పనులు మొదలైన మూడు నెలల్లో ట్రయల్ రన్ నిర్వహిస్తామన్నారు. పోర్టు నిర్మాణం పూర్తయితే అనుబంధ పరిశ్రమలు వచ్చి జిల్లా రూపురేఖలు మారుతాయన్నారు. యువకులు, సామాన్య ప్రజలు, పోర్టుకు వచ్చి అభివృద్ధి చూడాలని కోరారు. స్కూళ్ల యాజమాన్యాలు ఇక్కడ విహార యాత్రలు నిర్వహించి పోర్టు నిర్మాణంపై పిల్లలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రతిపక్ష నాయకులు కూడా వచ్చి చూడాలన్నారు. పద్నాలుగేళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు జిల్లాకు ఏం చేశారని ప్రశ్నించారు. విశాఖపట్నం పరిపాలన రాజధాని మన అందరికీ గర్వకారణమని, భోగాపురం ఎయిర్‌పోర్టు, మూలపేట పోర్టుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ నెల 15వ తేదీన పలాసలో జరిగే సీఎం పర్యటనకు అంతా రావాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమల్, జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి, స్థానిక సర్పంచ్ జె.బాబురావు తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు చేస్తాం: జేసీ



రైతులతో మాట్లాడుతున్న జేసీ నవీన్

సారవకోట: రైతుల వద్ద ఉన్న ఆఖరు గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. ఆయన శనివారం మండలంలోని బుడితి రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి లక్ష్యం లేకుండా రైతుల దగ్గరున్న ధాన్యం కొనుగోలు చేస్తామని, దీనిపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తేమశాతం దగ్గర ఇబ్బందులు వస్తున్నాయని రైతులు చెప్పగా రైస్‌మిల్లుల్లో ఇప్పుడు వినియోగిస్తున్న పరికరాల స్థానంలో కొత్తవి వాడేలా చూడాలని డీఎస్ఓ రమణకు ఆయన సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అధికారుల నంబర్లు డిస్‌ప్లే చేయాలన్నారు. ఆయనతో పాటు సివిల్ సప్లై డీఎం శ్రీనివాస్, తహసీల్దార్ హనుమంతరావు, సీఎస్ డీటీ గణేష్, ఏఓ వెంకటరావు, లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు నక్క తులసీదాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు నిక్కు రాజశేఖర్, నిక్కు కృష్ణారావు, మెండ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థులకు ఉచితంగా నర్సింగ్ సీట్లు

శ్రీకాకుళం రూరల్: ఎంసెట్‌లో పాసై, నీట్ పరీక్ష రాసిన పేద విద్యార్థులకు బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో అడ్మిషన్లు ఉచితంగా కల్పిస్తున్నట్టు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నాలుగేళ్ల కోర్సు పూర్తి చేసిన అనంతరం వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి కోర్సు ఫీజును జీతం నుంచి మినహాయిస్తామన్నారు. డిగ్రీ పాసైన వారికి మూడు నెలలు పాటు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పించి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు రాగోలులో గల జెమ్స్ ఆస్పత్రిలో బొల్లినేని మెడిస్కిల్స్ కార్యాలయాన్ని లేదా 7680945357, 9121999654 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

విందు భోజనంలో అపశ్రుతి

● ఒకరు మృతి ● పలువురికి అస్వస్థత
● హరిపురం, పలాస ఆస్పత్రుల్లో చేరిక



మృతిచెందిన జానకమ్మ (ఫైల్)

మందస: మండలంలోని ఉద్దాన ప్రాంతమైన బహడపల్లి పంచాయతీ నల్లబొడ్లూరు గ్రామంలో శుక్రవారం జరిగిన ఓ శుభ కార్యక్రమంలో అపశ్రుతి చోటు చేసుకుంది. రాత్రి విందు తిన్న వారిలో పలువురు అస్వస్థతకు గురయ్యారు. వారిలో భేతాళపురం గ్రామానికి చెందిన తెప్పల జానకమ్మ(35) అనే మహిళ మృతి చెందారు. పూర్తి వివరాల్లోకి వెళితే.. నల్లబొడ్లూరు గ్రామంలో శుక్రవారం ఓ వివాహ రిసెప్షన్ ఫంక్షన్ జరిగింది. అతిథులకు రాత్రి కూడా భోజనాలను ఏర్పాటు చేశారు. ఆ విందులో చికెన్ కర్రీ తిన్నవారు అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. నల్లబొడ్లూరు గ్రామానికి చెందిన సుమారు 18 మంది అస్వస్థతకు గురి కాగా, ఫంక్షన్‌కు వచ్చిన భేతాళపురం, రాంపురం, బిడిమి, నల్లబొడ్లూరు, పెద్దనల్లబొడ్లూరు తదితర గ్రామాలకు చెందిన మరో 15 మంది కూడా అనారోగ్యానికి గురయ్యారు. బాధితుల్లో కొంత మంది ఆయా గ్రామాల్లో వైద్య చికిత్స తీసుకున్నారు. కొంతమందిని హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రం, పలాసలో ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లారు. హరిపురంలో సీహెచ్‌సీలో డాక్టర్ ప్రకాశవర్మ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. పెద్దనారాయణపురం, భేతాళపురం, దున్నవూరు, రాణిగాం గ్రామాలకు చెందిన ఒ.జానకిరావు, జుత్తు దానమ్మ, దున్న కవిత, కళ్లేపల్లి గౌతమ్, దున్న రమేష్, నల్లబొడ్లూరుకు చెందిన బొడ్డు హేమవతి, గిరి, చంటి, తనూజ, బొడ్డు హేమ, లిఖిత తదితరులు చికిత్స పొందారు. భేతాళపురం గ్రామానికి చెందిన తెప్పల జానకమ్మ(35) ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆమెను శనివారం శ్రీకాకుళం తరలిస్తుండగా దారిలో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు స్పందించారు. నల్లబొడ్లూరులో వైద్య శిబిరం నిర్వహించాలని మందస పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మద్దిల సంపత్‌రావును ఆదేశించారు. గ్రామంలో శనివారం పర్యటించి, బాధితుల వివరాలు, యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి వద్దకే వైద్యం అందిస్తామన్నారు. మంత్రితో పాటు ఎంపీపీ డొక్కరి దానయ్య, సర్పంచ్ బొడ్డు శాంతిప్రియ, ఉదయ్, బాలిగాం పీఏసీఎస్ చైర్మన్ సాంర్ర ఢిల్లేశ్వరరావు, ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు పాల్గొన్నారు.



నల్లబొడ్లూరులో పర్యటిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

లాసెట్ మొదటి విడత ప్రవేశాలు పూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ లాసెట్-2023 మొదటి విడత ప్రవేశాలు శనివారంతో పూర్తయ్యాయి. త్వరలో రెండో విడత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేయనున్నారు. మొదటి విడత ప్రవేశాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని జ్యోతీరావు పూలే న్యాయ కళాశాలలో 44 సీట్లకు 22 మంది చేరారు. అఫిలియేషన్ కళాశాల ఎంపీఆర్ (శ్రీకాకుళం)లో మూడేళ్ల ఎల్ఎల్‌బీలో 61 సీట్లకు 39, ఐదేళ్ల ఎల్ఎల్‌బీలో 61 సీట్లకు 8 మంది ప్రవేశాలు పొందారు. రెండో కౌన్సెలింగ్‌లో సీట్లు వచ్చిన విద్యార్థులు కళాశాల మార్పునకు, లాసెట్‌లో ర్యాంకు వచ్చి ప్రవేశాలు పొందని విద్యార్థులు కళాశాలల ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశం లభిస్తుంది.

13న డి ఫార్మసీ కోర్సులో స్పాట్ ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో రెండేళ్ల డి.ఫార్మసీ కోర్సులో ప్రవేశాలకు ఈ నెల 13న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్‌డీఎల్‌పీ క్రిస్టియన్ తెలిపారు. శనివారం ప్రకటనలో వివరాలు వెల్లడించారు. ఇంటర్మీడియెట్ బైపీసీ, ఎంపీసీ ఉత్తీర్ణులైన విద్యార్థినులు అర్హులని పేర్కొన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడు సెట్ల జిరాక్సులతో 13వ తేదీన ఉదయం 9.30 గంటలకు ఫార్మసీ విభాగానికి హాజరు కావాలని సూచించారు. స్పాట్ ప్రవేశాలకు వసతి గృహం సౌకర్యం కల్పిస్తామని, ప్రభుత్వ రాయితీలు వర్తించవని స్పష్టం చేశారు.

● 10,300 కలాలతో క్రిస్మస్ ట్రీ



టి.లింగాలుపాడు పంచాయతీ పరిధి సీతారామపురం చర్చ్‌లో శనివారం పాస్టర్ తమ్మినేని రవిబాబు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. 10,300 పెన్నులతో తయారు చేసిన క్రిస్మస్ ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. -జలుమూరు

క్లుప్తంగా

భోజన నాణ్యతపై దృష్టి పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఎచ్చెర్ల క్యాంపస్ : భోజనం నాణ్యత, మెస్‌లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ శాస్త్రవేత్త జె.శ్రీనివాస్ అన్నారు. శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ఎస్ఎంపురం క్యాంపస్‌లో శనివారం ఆహార సలహా సంఘం సభ్యులు, వర్సిటీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెస్ కాంట్రాక్టర్ టెండర్ల మేరకు భోజనం నాణ్యతగా పెట్టాలన్నారు. విద్యార్థుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట ధన బాలాజీ, యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జి.భానుకిరణ్, పరిపాలన అధికారి ముని రామకృష్ణ పాల్గొన్నారు.

రేపు డిగ్రీ ప్రత్యేక పరీక్ష

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరీక్ష కేంద్రంలో ఇయర్ ఎండ్ డిగ్రీ స్పెషల్ ఎగ్జామ్ సోమవారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య ఒక ప్రకటనలో తెలిపారు. డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమంలో విద్యార్థుల విజ్ఞప్తి మేరకు ఇయర్ ఎండ్‌లో ఒక్క సబ్జెక్టు ఫెయిలైన విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 21 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో పేపర్ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు పవిత్ర



గార: మండల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి చెందిన ఇంటర్మీడియెట్ విద్యార్థిని వి.పవిత్ర జాతీయ స్థాయిలో జరగనున్న రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లలిత శనివారం తెలిపారు. ఇటీవల టెక్కలిలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. అనంతరం కర్నూలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించడంతో పూణేలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పవిత్రను పీఈటీ నారీగ్రేష్, ఉపాధ్యాయినులు అభినందించారు.

25 నుంచి అరసవల్లిలో ధర్మపథం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానం, శ్రీసుమిత్ర కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 31 వరకూ ఇంద్రపుష్కరిణి ఆవరణలో వైజయంతి ఉత్సవ వేదిక వద్ద ధర్మపథ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. ఈ మేరకు శనివారం అనివేటి మండపంలో కరపత్రాన్ని పాలకమండలి సభ్యుల సమక్షంలో ఆవిష్కరించారు. 25న కన్యాశుల్కం నాటకం, 26, 27 తేదీలలో సంగీత గాత్ర కచేరి, 28న శ్రీరామాంజనేయ యుద్ధం, 29న సత్యహరిశ్చంద్ర నాటకం, 30న శ్రీకృష్ణ రాయభారం, 31న నాదస్వర కచేరి తదితర కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, కోటేశ్వర చౌదరి, లుకలాపు గోవిందరావు, గన్నిరాజు, జె.శ్రీనివాస్, ద్వారపు అనురాధ, మైలపల్లి లక్ష్మి, మల్లెమ్మ, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, శ్రీసుమిత్ర కళాసమితి ప్రతినిధులు గుత్తు చిన్నారావు, నక్క శంకరరావు, పార్థసారధి, వి.వి.ఆర్ మూర్తి, సురేష్ పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: మానవ హక్కుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు అన్నారు. కళాశాల రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం 'ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ మాట్లాడుతూ మానవ హక్కులు అన్ని దేశాలలో అమలుపరచాలని ఐక్యరాజ్యసమితి తీర్మానం చేసిందన్నారు. అంతకుముందు కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు కలిసి ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ చింతాడ కృష్ణారావు, విభాగాధిపతులు డాక్టర్ ఎస్.చిన్నారావు, టి.ఆదిలక్ష్మి, కె.జ్యోతిలక్ష్మి, పి.సాయికనకదుర్గ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి కబ్జా!

- ఆర్టీసీ బస్సుషెల్టర్‌పై తెలుగుదేశం నేత కన్ను
- షెల్టర్‌తో పాటు స్థలం ఆక్రమణకు యత్నాలు
- అధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తూ గోడల నిర్మాణం
- హిరమండలం న్యూ బ్యారేజీ జంక్షన్‌లో అక్రమాల పర్వం



ఇక్కడ కనిపిస్తున్నది బస్ షెల్టర్ నిర్మాణం. లోతైన ప్రదేశం కావడంతో ముందు పిల్లర్లు వేసి ఎత్తుచేసి రోడ్డుకు సమానంగా షెల్టర్ నిర్మించాలనుకున్నారు. దీని ప్రకారమే పనులు చేపట్టారు. అయితే వివిధ కారణాలతో నిర్మాణం నిలిచిపోయింది. ఈ క్రమంలో ఓ టీడీపీ నాయకుడి కన్ను షెల్టర్ స్థలంపై పడింది. పిల్లర్లను మూసేసి షాపుల రూపంలో మార్చేలా నిర్మాణం చేపడుతున్నాడు. దీనికోసం ప్రభుత్వ భూమిని సైతం కబ్జా చేస్తున్నాడు. హిరమండలం, కొత్తూరు, పాతపట్నం, సారవకోట, జలుమూరు మండలాలకు వారధిగా ఉన్న హిరమండలం న్యూ బ్యారేజీ జంక్షన్‌లో వెలుగుచూసిన అక్రమ నిర్మాణమిది. సెంటున్నర ఉండే ఇక్కడి భూమి విలువ అక్షరాలా రూ.30 లక్షలు.



హిరమండలం బ్యారేజీ సెంటర్‌లో అసంపూర్తిగా ఉన్న బస్‌షెల్టర్ పిల్లర్ల మధ్య గోడలు కట్టిన దృశ్యం

హిరమండలం: తెలుగుదేశం నేతలు కబ్జాపర్వానికి తెరతీశారు. ఆర్టీసీ స్థలాన్ని దర్జాగా ఆక్రమించుకుంటున్నారు. అధికారుల ఆదేశాలు సైతం బేఖాతరు చేస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. హిరమండలం బ్యారేజీ సెంటర్ మూడు రహదారులకు జంక్షన్ కావడంతో(2018–19) టీడీపీ హయాంలో బస్ షెల్టర్ నిర్మాణానికి ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.లక్షన్నర నిధులు కేటాయించారు. లోతట్టు ప్రాంతం కావడంతో పిల్లర్లు, బేస్‌మెంట్ శ్లాబ్ వేసి విడిచిపెట్టారు. అప్పటికి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో పనులు మధ్యలో నిలిపివేశారు. తర్వాత కొద్దిరోజులకే ఎన్నికలు జరగడంతో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చింది. ఆరేళ్లుగా అసంపూర్తి ఉన్న ఈ నిర్మాణంపై టీడీపీ నాయకుడు, ఎంపీటీసీ భర్త కన్ను పడింది. ఆర్అండ్ఆర్ కాలనీ సర్పంచ్ భర్త సహకారం తీసుకుని తనదే భూమి అన్నట్టు వ్యవహరించడం ప్రారంభించాడు. అసంపూర్తిగా ఉన్న బస్‌షెల్టర్ చుట్టూ సిమెంట్ ఇటుకలతో గోడల నిర్మాణానికి పూనుకున్నాడు. దీనిపై కొందరు స్థానికులు ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆర్అండ్‌బీ ఏఈ పోలీసుల సహకారంతో చేరుకుని పనులు నిలిపివేయించారు. కొన్ని రోజుల తర్వాత మళ్లీ ఆక్రమణ ప్రయత్నాలు ప్రారంభించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎలాగైనా స్థలం స్వాధీనం చేసుకోవాలన్న ఆలోచన చేస్తున్నారు. దీనిలో భాగంగా రాత్రిపూట బస్‌షెల్టర్ పిల్లర్ల చుట్టూ గోడలు కడుతున్నారు. సమీపంలోని కొంత ఖాళీ స్థలాన్ని సైతం ఆక్రమించి గదులు కట్టాలన్న యోచనలో ఉన్నట్లు తెలిసింది. రాత్రికి రాత్రే దర్శనమిస్తున్న నిర్మాణాలతో స్థానికులు షాక్‌కు గురవుతున్నారు. ఇక్కడ ఆక్రమణల్లో ఉన్న భూమి విలువ దాదాపు రూ.30 లక్షలు ఉంటుందని అంచనా. అధి కారులు ఉదాసీనంగా వ్యవహరిస్తే భూమి మొత్తం ఆక్రమిస్తారని, ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నోటీసులు ఇస్తాం..

ఈ విషయమై తహసీల్దారు మురళీమోహన్ వద్ద ప్రస్తావించగా బస్‌షెల్టర్ అక్రమ నిర్మాణం విషయం తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఇప్పటికే ఆర్ఐ, సర్వేయర్లను పంపించి సర్వే చేయించామని చెప్పారు. ఆ స్థలం మేజర్ పంచాయతీ పరిధిలోకి వస్తుందన్నారు. పంచాయతీ అధికారుల ద్వారా సంబంధిత వ్యక్తులకు నోటీసులు పంపించి చర్యలు చేపడతామని తెలిపారు. ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడతామని చెప్పారు.

పలాసలో 'ఆడుదాం ఆంధ్రా'

- ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించే అవకాశం
- క్రీడా మైదానాలు పరిశీలించిన జాయింట్ కలెక్టర్ నవీన్



రైల్వే మైదానాలను పరిశీలిస్తున్న జేసీ నవీన్, అధికారులు

కాశీబుగ్గ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామీణస్థాయిలో క్రీడలను ప్రోత్సహించడానికి ఆడుదాం ఆంధ్రా అనే సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. అటువంటి రాష్ట్రస్థాయి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం పలాస వేదికగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించే అవకాశం ఉందని జాయింట్ కలెక్టర్ మల్లా నవీన్ తెలిపారు. ఈ మేరకు పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో శనివారం రెవెన్యూ ఉన్నతాధికారులతో కలిసి పర్యటించారు. ఈ నెల 15న పలాసలో కిడ్నీ పరిశోధన కేంద్రం ప్రారంభానికి విచ్చేస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి అదే రోజు పలాస వేదికగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం కూడా ప్రారంభించాలని ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించారు. దీనిలో భాగంగా పలాస రైల్వేస్టేషన్ పరిధిలోని జగన్నాథ మందిరం మైదానం, కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం, పాత జాతీయ రహదారిలోని స్మార్ట్ స్కూల్ గ్రౌండ్‌ను పరిశీలించామని చెప్పారు. కార్యక్రమంలో పలాస ఆర్‌డీఓ భరత్‌నాయక్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్, సెట్‌శ్రీ సీఈఓ డి.వి.ప్రసాదరావు, పలాస తహశీల్దారు లంబాల మధుసూదనరావు, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇంటి పట్టా ఇవ్వాల్సిందే



అధికారులతో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు : సొంత ఇంటిని నిర్మించుకునేందుకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ పట్టాను ఇవ్వాల్సిందేనని స్పీకర్ తమ్మినేని సీతారాం అధికారులను ఆదేశించారు. ఆమదాలవలసలోని తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, మండల పరిషత్, హౌసింగ్, ఇంజినీరింగ్ అధికారులతో స్పీకర్ సమీక్ష నిర్వహించారు. కొత్తగా దరఖాస్తులు చేసుకున్న వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయడంలో అలసత్వం వహించిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.10 లేఅవుట్‌లలో కనీసం ఒక్క ఇంటి నిర్మాణం కూడా జరగలేదని, అధికారుల నిర్లక్ష్యానికి నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ సదుపాయం, రహదారుల నిర్మాణం, కాలువలు, నీటి వసతి కల్పన వంటి కనీస చర్యలు తీసుకోకపోవడం ఎంత వరకు సమజంసమని ప్రశ్నించారు. మండలంలో 1780 ఇళ్లు మంజూరు చేశామని, అందులో 938 పూర్తి కాగా, 499 బీబీఎల్ స్థాయి, 189 బేస్‌మెంట్, 71 రూఫ్‌లెవెల్, 82 శ్లాబ్, ఒకటి ఎస్ఎస్ స్థాయిలో ఉన్నాయని వివరించారు. కనిమెట్ట లేఅవుట్‌లో 57 బిట్లు ఇచ్చినా లబ్ధిదారులకు పట్టాలు ఎందుకు పంపిణీ చేయలేదని ప్రశ్నించారు. . సీఎం ఆలోచనలకు అనుగుణంగా అధికారులు ప్రజలకు సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, పార్టీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, ఆర్డీవో రంగయ్య, హౌసింగ్ పీడీ గణపతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగిరెడ్డి, తహశీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీఓ హరిహరరావు, ఏఎంసీ చైర్మన్ సునీల్, నాయకులు కిల్లాన సూర్యారావు, బండారు ప్రతాప్, వందాన వెంకటరావు, తమ్మినేని కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం: ఆర్టీసీలో ప్రస్తుతం పనిచేస్తున్న, విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.అప్పారావు, ఎస్ఎస్ఆర్ శర్మ కోరారు. శనివారం కె.శంకరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీరు మాట్లాడుతూ పెన్షన్ కోసం ఉమ్మడి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి గణేష్, పెంటయ్య, ప్రతాప్, ప్రసాద్, సంజీవి, రామారావు, చిన్నారావు, శాస్త్రి, మల్లేష్, సుబ్బారావు, రుషి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యునైటెడ్ క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం కల్చరల్: క్రిస్మస్ పండుగా అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆకాంక్షించారు. శ్రీకాకుళం మహిళ కళాశాల రోడ్డులోని క్రైస్తవారాధన కేంద్రంలో ఎస్ఎంయూపీఎఫ్, ఎస్‌సీడబ్ల్యూఏ, బీజీసీ, ఎస్ఎంసీపీఏ ఆధ్వర్యంలో యునైటెడ్ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. కోయర్ బృందం క్రైస్తవ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో సభాధ్యక్షుడు బిషప్ డి.ఎస్.వి.ఎస్.కుమార్, బిషప్ జాషువా అభిషేక్, సీహెచ్ గురుమూర్తి, శామ్యూల్ మోజెస్, బి.రాజు, దయానంద్, కె.డేనియల్, డీఎల్‌బీఎల్.కుమార్, జె.జీవన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం నుంచి మంటలు



కాలిపోతున్న బైక్

మందస : మేజరు పంచాయతీ మందసలోని కిల్లంవీధిలో ఓ ద్విచక్ర వాహనం నుంచి శనివారం మంటలు చెలరేగాయి. జిల్లుండ గ్రామానికి చెందిన శ్రీను అనే వ్యక్తి కవిటి మండలంలోని ఉంటున్నాడు. అయ్యప్ప దీక్ష తీసుకున్న ఆయన సొంత పనుల నిమిత్తం మందస వచ్చాడు. హఠాత్తుగా వాహనం నుంచి మంటలు రావడంతో చుట్టు పక్కల ఉన్నవారంతా స్పందించి ఇసుక, నీరు వేసి మంటలను ఆర్పివేశారు. ద్విచక్రవాహనం పాక్షికంగా దెబ్బతింది. పెద్ద ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

దివ్యాంగులకు మనోస్థైర్యం కలిగించాలి



విభిన్న ప్రతిభావంతుడికి ట్యాబ్ అందజేస్తున్న గోవిందరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: విభిన్న ప్రతిభావంతులకు(దివ్యాంగులకు) మనోస్థైర్యం కలిగిస్తే అద్భుతాలు సృష్టిస్తారని సమగ్రశిక్ష ప్రాజెక్ట్ సహిత విద్యా జిల్లా కోఆర్డినేటర్ పొందూరు గోవిందరావు అన్నారు. ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల వారోత్సవాల ముగింపు వేడుకలను శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని భవిత కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. దృష్టిలోపం, వినికిడిలోపం ఉన్న దివ్యాంగులకు ట్యాబ్‌లు అందజేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఆర్డీవో రంగయ్య భవిత కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎంఈవో జి.కృష్ణారావు, ఐఈ ఆర్పీలు బి.కుసుమకుమారి, చెల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు.

బైకు నుంచి జారిపడి మహిళ మృతి

టెక్కలి రూరల్: పాతపట్నం మండలం గోపాలపురం గ్రామానికి మంగి కమలమ్మ(45) అనే వివాహిత శనివారం టెక్కలి సమీపంలో ద్విచక్ర వాహనం నుంచి జారిపడి మృతిచెందింది. ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపురం గ్రామానికి చెందిన కమలమ్మ టెక్కలి మండలం శాసనం గ్రామంలోని కన్నవారింటికి వచ్చింది. తిరిగి అత్తవారింటికి వెళ్లేందుకు శాసనం నుంచి ద్విచక్రవాహనం లిఫ్ట్ అడిగి వస్తుండగా అయోధ్యాపురం సమీపంలో బైకు నుంచి జారిపడింది. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాలు కావడంతో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు 108 అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. కాగా, ఈమెను తీసుకొచ్చిన ద్విచక్ర వాహనదారుడి వివరాలు తెలియలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లిఫ్ట్ అడిగి.. గొలుసు కొట్టేసి..

- స్కూటీ యజమానికి మహిళ మస్కా
- తులంన్నర బంగారం చైన్ అపహరణ

కోటబొమ్మాళి: లిఫ్ట్ అడిగి బైకు ఎక్కిన ఓ మహిళ చాకచాక్యంగా చైన్ కొట్టేసింది. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. వివరాల్లోకి వెళ్తే.. నందిగాం మండలం ఆర్.జె.బొడ్డపాడు గ్రామానికి చెందిన మురపాల చిరంజీవి శనివారం ఉదయం పది గంటల సమయంలో కోటబొమ్మాళి మండలం దుప్పలపాడులో తన మేనకోడలి ఇంటికి స్కూటీపై బయలుదేరాడు. గుంజిలోవ జంక్షన్ వద్ద గుర్తు తెలియని మహిళ స్కూటీని ఆపి తనకు జలుమూరు మండలం చల్లపేట వరకు లిఫ్ట్ కావాలంటూ స్కూటీ ఎక్కింది. కస్తూరిపాడు వద్దకు వచ్చేసరికి బహిర్భూమికి వెళ్తానని బండి దిగింది. చాకచక్యంగా చిరంజీవి మెడలోని తులమున్నర బంగారం చైనును తెంచేసి ముల్లపొదల్లోకి పారిపోయింది. చిరంజీవి కేకలు వేయగా అక్కడికి చేరిన వ్యక్తులతో వెతికినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. తాను మోసపోయానని గ్రహించిన చిరంజీవి కోటబొమ్మాళి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు.

గ్రామదేవత ఆలయంలో చోరీ

టెక్కలి రూరల్: మండలంలోని రాధావల్లభపురంలో పాలపోలమ్మతల్లి గ్రామదేవత ఆలయంలో శనివారం చోరీ జరిగింది. అమ్మవారి వెండి కిరీటంతో పాటు సుమారు 2.5 తులాల బంగారు పుస్తెలు, ముక్కుపుడకను దొంగలు దోచుకుపోయారు. శనివారం ఉదయం గుడి తెరిచేసరికి చోరీ జరిగినట్లు గుర్తించిన గ్రామస్తులు టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు. ఇక్కడి ఆలయానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పలుమార్లు కమిటీ సభ్యులకు సూచించామని చెప్పారు.

కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీజేపీ నేతల నిరసన

శ్రీకాకుళం న్యూకాలనీ: కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహు ఇంట్లో రూ.200 కోట్లు పైబడి నోట్లు కట్టలు గుట్టలు గుట్టలుగా ఆదాయపు పన్ను శాఖకు పట్టుబడటం దేశ వ్యాప్తంగా సంచలనమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు అన్నారు. కాంగ్రెస్ అవినీతి నాయకులకు వ్యతిరేకంగా బీజేపీ నాయకులు జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద ప్లకార్డులతో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబ్జీ, శవ్వాన ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 777 కేసులు పరిష్కారం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 777 కేసులు పరిష్కరించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలోజిల్లా కోర్టుతో పాటు వివిధ న్యాయస్థానాల పరిధిలో లోక్ అదాలత్ నిర్వహించారు. పీఎల్‌సీ 92, క్రిమినల్ కేసులు 571, సివిల్ కేసులు 114 పరిష్కరించారు. వీటిద్వారా సుమారు రూ.365,12,601 వసూలు చేసి కక్షిదారులకు అందజేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో మాస్టర్ అథ్లెట్స్ ప్రతిభ



పోటీల్లో పాల్గొన్న జిల్లా మాస్టర్ అథ్లెట్స్

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా మాస్టర్ అథ్లెట్స్ పతకాల పంట పండిస్తున్నారు. తిరుపతి వేదికగా మూడు రోజులపాటు జరగనున్న 42వ ఏపీ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2023 పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు రన్స్, త్రోస్, జంప్స్ విభాగాల్లో సత్తాచాటారు.

పలువురు మాస్టర్ అథ్లెట్స్ 20కిపైగా పతకాలు సాధించారు.పతకాలు సాధించినవారిని జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ చౌదరి పురుషోత్తమనాయుడు, సంఘ జిల్లా అధ్యక్షుడు బొడ్డేపల్లి నారాయణరావు, ప్రధాన కార్యదర్శి పాలకొండ అప్పారావు, చల్లా జగదీష్, భాగ్యలక్ష్మి అభినందించారు.

వెంకన్నకు విశేష అలంకరణ



జిల్లా కేంద్రంలోని చిన్నబజారులో దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక శనివారం సందర్భంగా స్వామిని తులసి మాలలతో అలంకరించారు. అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అష్టోత్తర శతనామాలతో అర్చనలు, పూజలు చేశారు. అధిక భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. – శ్రీకాకుళం కల్చరల్